AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## యథావిధిగా పోలీస్ ప్రజావాణి



**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో పోలీస్‌ప్రజావాణి కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభిస్తున్నట్లు సీపీ సాయిచైతన్య తెలిపారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా కొన్నిరోజులు కార్యక్రమాన్ని నిలిపేశామన్నారు. ఎన్నికల కోడ్ ముగిసినందున ఈనెల 23 నుంచి ఎప్పటిలాగే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యలను ప్రజావాణిలో విన్నవించుకోవచ్చన్నారు.


21-2-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2


## పీహెచ్‌సీ, ఇందిరమ్మ ఇళ్ల పనుల పరిశీలన



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూరు మండలంలోని దేగాం గ్రామంలోని పీహెచ్‌సీని ఎంపీడీవో గంగాధర్ సందర్శించారు. సిబ్బందితో సమీక్షించారు. గర్భిణుల సంరక్షణ, మాతా-శిశు ఆరోగ్య కార్యక్రమాలు, టీకాల అమలు, సిబ్బంది హాజరు, ఆస్పత్రి పరిశుభ్రత, మందుల లభ్యత, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి తగిన సూచనలు చేశారు. రోగులకు మెరుగైన సేవలు అందేలా క్రమబద్ధంగా విధులు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం దేగాం నర్సరీని పరిశీలించి మొక్కల సంరక్షణ, నీటి సరఫరా, పెంపకం విధానాలపై సూచనలు చేశారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పనులను సందర్శించి పనులు నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. అలాగే ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనులను తనిఖీ చేసి కార్మికులకు సమయానికి వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లింగారెడ్డి, పంచాయతీ కార్యదర్శి నవీన్, పీహెచ్‌సీ వైద్యులు ఆయేషా తదితరులు పాల్గొన్నారు.



## పోతంగల్ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా సిందే షాజీ పటేల్

**అక్షరటుడే, కోటగిరి:** పోతంగల్ మండల సర్పంచ్‌ల ఫోరం సంఘం అధ్యక్షుడిగా సుంకిని సర్పంచ్ ఎస్ షాజీ పటేల్ ఎన్నికయ్యారు. మండల కేంద్రంలోని సాయిబాబా ఫంక్షన్ హాల్‌లో సర్పంచ్‌ల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. అనంతరం కార్యావర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం కార్యదర్శిగా ఫిరోజ్, కోశాధికారిగా సునీల్, సలహాదారులుగా కనకమేడల శ్రీనివాస రావు, రాజు, రాంరెడ్డి సంజీవ్ కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా షాజీ పటేల్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు సర్పంచ్‌లకు ఎల్లవేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. సర్పంచులందరూ ఐక్యంగా ఉండి గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని షాజీ పటేల్ అన్నారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజ్, డీసీసీబీ మాజీ ఛైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి సహకారంతో ఈ కమిటీని ఎన్నుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గంధపు పవన్, ఎజాజ్ ఖాన్, గంగాధర్, శివాజీ పటేల్ తదితరులు పాల్గొన్నారు.



# పొలిటికల్ హీట్..

కామారెడ్డి జిల్లా కేంద్రం రాజకీయ రణరంగంగా మారింది. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆస్తులపై కాంగ్రెస్, బీజేపీ సవాళ్లు, ప్రతి సవాళ్లతో.. శనివారం పట్టణంలో హైటెన్షన్ నెలకొంది. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది.

పలువురు కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేసిన పోలీసులు స్వల్ప లాఠీఛార్జ్ చేయాల్సి వచ్చింది. అంతేకాకుండా కామారెడ్డికి రాకుండా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడితో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు.

- అక్షరటుడే, కామారెడ్డి



- కామారెడ్డిలో కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ
- కళాశాల ఆస్తుల వివాదంపై చర్చకు వస్తానన్న ఎమ్మెల్యే కేవీఆర్
- భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు.. అరెస్ట్
- ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత..
- కాంగ్రెస్ నాయకుడి కారుకు నిప్పు

కామారెడ్డిలో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. అరోరా కాలేజీ భూముల విషయంలో బీజేపీ, కాంగ్రెస్ విమర్శలు, సవాళ్లతో ఆస్తుల అంశం హాట్ టాపిక్‌గా మారింది. అసలు కళాశాల ఆస్తుల మార్పిడిలో ఎవరి హస్తం ఉంది. భూములపై రుణం తీసుకున్నదెవరు అనేది తేలుస్తానని, ఆధారాలతో వస్తున్నానని ఎమ్మెల్యే ప్రకటించడం రాజకీయ వేడికి కారణమైంది.

కామారెడ్డి మున్సిపల్ ఎన్నికలు ముగిశాక ప్రమాణ స్వీకారం అనంతరం ఎమ్మెల్యేపై ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపాయి. షబ్బీర్ అలీ ఆరోపణలపై ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి ఘాటుగా స్పందించారు. షబ్బీర్ అలీ చరిత్ర ఇదీ అంటూ చర్చకు రావాలని సవాల్ చేశారు. దాంతో ఇరువర్గాల సవాళ్లు, ప్రతి సవాళ్లతో రాజకీయం వేడెక్కింది. శనివారం ఇరువురు నేతలు శిశుమందిర్ వద్దకు వస్తామని ప్రకటించడంతో ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి.

### కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ

ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూములను అరోరా కళాశాలకు ధారాదత్తం చేశారని ఎమ్మెల్యేపై వచ్చిన ఆరోపణలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. ఎమ్మెల్యే ఆయన తండ్రిపై ఆరోపణలు రావడంతో ఎమ్మెల్యే తీవ్రంగా స్పందించారు. దాంతో కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ సవాళ్లు చేసుకున్నారు. ఆధారాలతో నిజానిజాలు తెలియజేయడానికి కళాశాల గ్రౌండ్‌కు వస్తున్నానని ఎమ్మెల్యే ప్రకటించడంతో రాజకీయాలు రసవత్తరంగా మారాయి.

### కాంగ్రెస్ నాయకుల అరెస్ట్

ఎమ్మెల్యే పిలుపుతో కాంగ్రెస్ శ్రేణులు భారీస్థాయిలో శిశుమందిర్ వద్దకు చేరుకోగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. అనంతరం నాయకులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో ఎమ్మెల్యేపై కాంగ్రెస్ నాయకులు మరోసారి ఆరోపణలు చేశారు

### క్యాంప్ ఆఫీస్ వద్ద ఉద్రిక్తత

క్యాంప్ ఆఫీసు వద్ద పోలీసులు బందోబస్తు చేపట్టారు. కాంగ్రెస్ నాయకుడు మహేందర్ రెడ్డి క్యాంపు కార్యాలయానికి చేరుకుని హల్చల్ సృష్టించగా పోలీసులు అరెస్ట్ చేశారు.బీజేపీ నాయకులు సైతం ఆయనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహేందర్ రెడ్డి కారును ధ్వంసం చేసి కారుకు నిప్పు పెట్టారు. దాంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులకు,



కార్యకర్తలకు మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో స్వల్ప లాఠీఛార్జ్ చేయాల్సి వచ్చింది.

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి హౌస్ అరెస్ట్

కామారెడ్డిలో పరిస్థితుల దృష్ట్యా కామారెడ్డికి వస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావును హైదరాబాద్



లో పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ నేత యెండల లక్ష్మీనారాయణ తదితర నాయకులను పలు చోట్ల ఎక్కడికక్కడే అడ్డుకుని అరెస్ట్ చేశారు. దాంతో కామారెడ్డికి వచ్చే దారులన్నీ పోలీసుల చర్యలతో మూసుకుపోయాయి. బాన్సువాడ, కామారెడ్డిలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో పోలీసులు ముందస్తు చర్యలు తీసుకున్నట్టుగా తెలుస్తోంది.



## మున్నూరుకాపులు రాజకీయంగా ఎదగాలి

**అక్షరటుడే, ఆర్మూర్:** మున్నూరు కాపులు రాజకీయంగా ఎదగాలని మున్సిపల్ కౌన్సిలర్లు అభిప్రాయపడ్డారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మున్నూరు కాపు పటేల్ సంఘం ఆధ్వర్యంలో శనివారం నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్నూరుకాపు యువత రాజకీయాల్లోకి రావాలని వారు ఆకాంక్షించారు. పార్టీలకతీతంగా మున్నూరు కాపులు ఎమ్మెల్యే స్థానాలకు భవిష్యత్తులో పోటీ చేసే విధంగా ఎదగాలని వారు కోరారు. ఈ సందర్భంగా 3వ వార్డు కౌన్సిలర్ యామాద్రి కవితా భాస్కర్, 35వ వార్డు కౌన్సిలర్ సడాక్ వినోద్, 34వ వార్డు కౌన్సిలర్ నర్మే నవీన్, 12వ వార్డు కౌన్సిలర్ తాటి నీలిమ హన్మాండ్లు, 13వ వార్డు కౌన్సిలర్ కొడిగెల మల్లయ్య, 33వ వార్డు కౌన్సిలర్ బొగడమీది రాణి సుమన్, 9వ వార్డు కౌన్సిలర్ పోచంపాడ్ శ్రీనివాస్‌లను సన్మానించారు. మున్నూరు కాపులు ఐక్యంగా ఉండాలనే కౌన్సిలర్లను సన్మానించినట్లు ఎంకేపీఎస్ అధ్యక్షుడు శేఖర్ తెలిపారు. కార్యక్రమంలో సంఘం శాశ్వత అధ్యక్షుడు గోపు దేవిదాస్, గౌరవ అధ్యక్షుడు గుర్తె సాయన్న, కోశాధికారి గజ్జి శ్రీనివాస్, సభ్యులు పెంట జలంధర్, లక్ష్మీ నర్సయ్య, లెక్చరర్ దేవన్న, భోజన్న, లక్ష్మణ్, పవన్, గంగాధర్, నాగేష్, గంగారం, నరేందర్ రావు, సంగం అనిల్ పాల్గొన్నారు.



## కొనసాగుతున్న రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీలు

**అక్షరటుడే, ఇందూరు:** సీఎంకప్‌లో భాగంగా జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ మైదానంలో బాస్కెట్ బాల్ పోటీలు కొనసాగుతున్నాయి. ఆయా జిల్లాల క్రీడాకారులు శనివారం హోరాహోరీగా తలపడ్డారు. బాలికల విభాగంలో సిద్దిపేట జిల్లాపై నిజామాబాద్, మెదక్‌పై మేడ్చల్ జట్టు, సిరిసిల్లపై మహబూబ్‌నగర్ విజయం సాధించాయి. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య, జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం కార్యదర్శి బొబ్బిలి నరేష్, వ్యాయామ ఉపాధ్యాయులు సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దు: సీపీ సాయిచైతన్య



**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం :** సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మరాదని, ప్రతిఒక్కరూ శాంతియుత వాతావరణంలో పండుగలను జరుపుకోవాలని సీపీ సాయి చైతన్య సూచించారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలోని అన్ని మతాల పెద్దలతో సీపీ ఆఫీస్‌లో శనివారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఉగాది, హోలీ, రంజాన్ పండుగల దృష్ట్యా శాంతి కమిటీ సమావేశం నిర్వహించామని సీపీ తెలిపారు. నిజామాబాద్ జిల్లా గంగా జమునా తెహజీబ్‌కు ప్రతీక అన్నారు. అన్ని మతాల వారు సోదరభావంతో ఉండాలని సూచించారు. రంజాన్ మాసంలో మసీదుల వద్ద ప్రార్థనల సమయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన భద్రత, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. పుకార్లను నమ్మవద్దని సూచించారు. పండుగల వేళ అందరూ శాంతియుతంగా ఉంటూ పోలీస్‌శాఖ కు సహకరించాలని కోరారు. ఎవరికి ఎలాంటి సమస్య వచ్చినా సంబంధిత పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని లేదా డయల్ 100ను సద్వినియోగపర్చుకోవాలని తెలిపారు. శాంతి కమిటీ సమావేశంలో పాల్గొన్న మతపెద్దలు ఈ సూచనలను ఆయా కాలనీల్లో ప్రజలకు వివరించాలని చెప్పారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) జి.బస్వారెడ్డి నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, ట్రాఫిక్ ఏసీపీలు ప్రకాష్, శ్రీనివాస్, వెంకట్ రెడ్డి, మస్తాన్ అలీ, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, సీఐలు, జిల్లాలోని అన్ని మతాల మతపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## అసాంఘిక శక్తులపై చర్యలు తీసుకుంటాం: ఎస్పీ రాజేష్ చంద్ర




**అక్షరటుడే, బాన్సువాడ :** పట్టణంలో అల్లర్లు సృష్టించాలనుకునే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ రాజేష్ చంద్ర హెచ్చరించారు. ఈ మేరకు బాన్సువాడ పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని ఓ మాల్‌లో గురువారం సేల్స్‌గర్ల్స్‌తో ఓ వ్యక్తి వాగ్వాదానికి దిగాడన్నారు. ఈ విషయమై తమకు ఫిర్యాదు అందడంతో అతడిపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. అయితే కొందరు వ్యక్తులు ఈ ఘటనను దృష్టిలో పెట్టుకుని శుక్రవారం రాత్రి బాన్సువాడ పోలీస్‌స్టేషన్ ఎదుట రాళ్లు రువ్వుతూ హంగామా చేశారన్నారు. ఈ ఘటనలో తమ కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయని తెలిపారు. కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 42 మందిపై కేసులు నమోదు చేయబోతున్నామని తెలిపారు. అలాగే బాన్సువాడ బంద్ అంటూ కొందరు పిలుపునిచ్చారని.. సోషల్ మీడియాలో సైతం రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని.. వారిని సైతం అదుపులోకి తీసుకున్నామన్నారు. ఇప్పటికే ఒకరిపై కేసు నమోదైందని.. మరికొందరిపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు. పట్టణంలో 144 సెక్షన్ పెట్టే అవసరం లేదని.. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని ఎస్పీ తెలిపారు. అదనపు బలగాలను సైతం పట్టణానికి రప్పించామన్నారు. అలాగే ప్రజలు సైతం ఎలాంటి అపోహలకు గురికావద్దని.. సోషల్‌మీడియాలో వచ్చే పోస్టులను పట్టించుకోకుండా వారివారి పనులు చేసుకోవాలని సూచించారు. రాళ్లు రువ్విన వ్యక్తులకు సంబంధించిన సీసీ పుటేజీలు వీడియోలను మూడు బృందాలు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాయని.. ఎవ్వరిని కూడా వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఎస్పీ చెప్పారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

ఆర్మూర్ మున్సిపాలిటీ పరిస్థితి అధ్వానంగా మారింది. కార్యాలయంలో ఓవైపు అవినీతి రాజ్యమేలుతుంటే.. మున్సిపల్ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనలోనూ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇటీవల బల్దియాకు కొత్త పాలకవర్గం ఎన్నికైంది. వారిపైనే పట్టణ ప్రజలు గంపెడాశలు పెట్టుకున్నారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ ప్రక్షాళన జరుగుతుందని ఆశిస్తున్నారు. – అక్షరటుడే, ఆర్మూర్



# ఆర్మూర్ బల్దియా ప్రక్షాళన జరిగేనా..!?

■ కొత్త పాలకవర్గానికి సమస్యల స్వాగతం ■ అవినీతి కూపంలో మున్సిపాలిటీ ■ సమస్యలపై దృష్టి పెడితేనే సరి..

ఆర్మూర్ మేజర్ గ్రామపంచాయతీ నుంచి మూడో గ్రేడ్ మున్సిపాలిటీగా 2008లో ఆవిర్భవించింది. ఆ తర్వాత 2018 మామిడిపల్లి, పెర్కిట్ మేజర్ గ్రామపంచాయతీలను కలుపుకొని సెకండ్ గ్రేడ్ మున్సిపాలిటీగా రూపుదిద్దుకుంది. ప్రస్తుతం ఆర్మూర్ మున్సిపాలిటీకి నాల్గో పాలకవర్గం కొలువదీరనుంది. ఈనెల 26న గోనె లహరి మున్సిపల్ ఛైర్పర్సన్‌గా బాధ్యతలను స్వీకరించనున్నారు.

### ఆర్మూర్ మున్సిపాలిటీలో 36 వార్డులు..

వందకు పైగా కాలనీలు.. లక్ష పైచిలుకు జనాభా ఉంది. పట్టణంలో ముఖ్యంగా పారిశుధ్య సమస్య వేధిస్తోంది. రోజువారి వార్డుల పరిధిలోని కాలనీలో చెత్తను సేకరించడానికి ఆటోలను ఏర్పాటు చేసినప్పటికీ సరిపడినన్ని ఆటోలు లేకపోవడంతో కొన్ని ఏరియాల్లో చెత్త పెద్ద సమస్యగా మారింది. మరోవైపు పారిశుధ్య సిబ్బంది సక్రమంగా మురికి కాల్వలను శుభ్రం చేయకపోవడంతో మురికి నీరు కాల్వల్లోనే నిలిచి దుర్గంధం వస్తోందని.. దోమలు పెరిగాయని ఆయా కాలనీల ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. మరోవైపు దోమల నివారణకు



ఫాగింగ్ మిషన్లతో నివారణ చర్యలు మొత్తానికి కనిపించట్లేదని వారు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం వేసవిలో కొన్ని కాలనీల్లో నీటి ఎద్దడి అధికంగా ఉండే అవకాశం ఉంది.

### అవినీతి కూపంలో మున్సిపాలిటీ..

ఆర్మూర్ పురపాలక కార్యాలయం అవినీతి కూపంలో మునిగిపోయింది. టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ సెక్షన్, శానిటరీ సెక్షన్, జనన, మరణ విభాగాలు అవినీతికి కేంద్రాలుగా మారాయి. మున్సిపల్ కార్యాలయంలో అవినీతి తారాస్థాయికి చేరింది. ప్రతిపనికి వెలకట్టి వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కొన్ని సెక్షన్లలో అన్ని తామై చక్రం తిప్పుతున్నారని వినికిడి.

### కొత్త పాలకవర్గంపై బాధ్యతలు..

ఆర్మూర్ నూతన పాలకవర్గానికి సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. ముఖ్యంగా అవినీతి, అక్రమాల కేరాఫ్‌గా మున్సిపల్ మారింది. అక్రమ ఇంటి నంబర్ల కేటాయింపు, ప్రభుత్వ, ఇరిగేషన్ భూముల ఆక్రమణ, ఇంటి నంబర్ల కేటాయింపులు ఇలా అనేక విషయాల్లో కొత్తపాలకవర్గం ప్రక్షాళన చేయాల్సి ఉంది. ఇక కొత్తపాలకవర్గం అవినీతి అధికారుల భరతం పట్టి ఆర్మూర్ పట్టణాన్ని ఏమేరకు అభివృద్ధి పథంలో నడిపిస్తారో వేచి చూడాలి.

## గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ తెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ




**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్స్ నిజామాబాద్ క్యాలెండర్‌ను శనివారం ఆవిష్కరించారు. అధ్యాపకులు మధు కుమార్, వైష్ణవి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల కమ్మర్‌పల్లి అధ్యాపకులు పాల్గొన్నారు.

## సీఎం కప్ రాష్ట్రస్థాయి ఆర్చరీలో జిల్లా క్రీడాకారిణికి కాంస్యం



**అక్షరటుడే, ఇందూరు:** సీఎం కప్ రాష్ట్రస్థాయి ఆర్చరీ టోర్నీలో జిల్లా క్రీడాకారిణి శ్రీనిక కాంస్య పతకం సాధించింది. ఖమ్మంలో శనివారం జరిగిన టోర్నీలో అద్భుత ప్రతిభను చాటి పతకాన్నికైవసం చేసుకుంది. ఈ సందర్భంగా జిల్లా యువజన క్రీడా అధికారి పవన్ కుమార్, ఆర్చరీ కోచ్ మురళి క్రీడాకారిణిని అభినందించారు.

## రైతులకు వ్యవసాయ పనిముట్ల అందజేత



**అక్షరటుడే, కోటగిరి:** మండల కేంద్రంలోని రైతువేదికలో రైతులకు శనివారం వ్యవసాయ పనిముట్లను అందజేశారు. ఏఎంసీ ఛైర్మన్ గైక్వాడ్ హన్మంత్, సర్పంచ్ కల్లూర్ సంధ్య, మండల ఏవో నిషిత ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ యంత్రీకరణ సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చర్ మెకానిసెషన్ పథకం కింద లబ్ధి పొందిన రైతులకు ట్రాక్టర్‌తో నడిచే పరికరాలు అనగా రోటోవేటర్లు, స్ట్రాబేలర్, మొక్కల సంరక్షణ పరికరాలు అందజేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి సుప్రియ, రైతులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి విరాళం



**అక్షరటుడే, ముప్కాల్:** మండలంలోని లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ధ్వజస్తంభానికి ఇత్తడి తొడుగు ఏర్పాటుకు మాజీ జడ్పీటీసీ సభ్యులు బద్దం నర్సవ్వ-నర్సారెడ్డి దంపతులు విరాళం అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులకు శనివారం రూ.1,01,000 చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి భక్తులు ముందుకు రావడం అభినందనీయమన్నారు.

## కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** డోంగ్లీ మండల కేంద్రంలో శనివారం మండలానికి చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా నిరంతరం కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## విలువలతో కూడిన రాజకీయం చేయాలి



**అక్షరటుడే, బాన్సువాడ:** రాజకీయంలో ప్రతిఒక్కరూ విలువలు పాటించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, సీనియర్ జర్నలిస్ట్ కాదేపురం గంగన్న అన్నారు. బీర్కూర్ మండలంలోని బరంగెడ్గి గ్రామంలో శనివారం కాంగ్రెస్ నాయకులతో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా తీర్పును ఎంతటివారైనా శిరసావహించాల్సిందేనని గంగన్న అన్నారు. ప్రజలు ఎత్తుకున్నారని సంబరపడవద్దని, వారి నమ్మకాన్ని వమ్ము చేస్తే ఆ ఎత్తుకున్న ప్రజలే పాతాళానికి తొక్కుతారని వ్యాఖ్యానించారు. తమ గ్రామానికి చెందిన కొంతమంది నాయకులు శుక్రవారం చేసిన ప్రకటన బాధాకరమన్నారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆగమేఘాల మీద సీసీ రోడ్డు, డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన చేశారని అనడం సిగ్గుచేటన్నారు. బాన్సువాడ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసింది, బాన్సువాడకు విలువైన రాజకీయాలు నేర్పింది పోచారమేనని గంగన్న పేర్కొన్నారు. గ్రామ ప్రజలకు గ్రామాభివృద్ధికి తాము అడ్డుకాదని, మాకు చేతనైనంత తమ నాయకులు ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజ్, మాజీ డీసీసీబీ ఛైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి సహకారంతో నిధులు తెచ్చి గ్రామాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. మీరు కూడా గ్రామానికి నిధులు తెచ్చి, అభివృద్ధి చేయాలని సవాల్ విసిరారు. రాజకీయాల్లో అర్థంలేని విమర్శలు చేస్తే ఊరుకోబోమని గంగన్న హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు గోండ్ల శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ గోండ్ల రాజు, నాయకులు ఇందూర్ గజేందర్, పుల్కంటి హన్మంత్, కుర్మ నాగుగౌండ, కోరె హావగిర్ రావు, హట్కరి దశరథ్, మొండికారి వీరప్ప, బజ్జిగౌండ, గాజుల గజేందర్, నీరడి రాములు, బసలింగప్ప, క్యాదెని లింగప్ప, సాలె సాయిబాబా, జాకారం గంగారాం తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీవాడలో బోరు తవ్వకం



**అక్షరటుడే, ముప్కాల్:** బుస్సాపూర్ గ్రామంలోని ఎస్సీవాడలో తాగునీటి సౌకర్యం మెరుగుపర్చేందుకు నూతనంగా బోరు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ నూతిపల్లి శ్రీనివాస్ రెడ్డి పాల్గొని బోరును ప్రారంభించారు. గ్రామ ప్రజలకు తాగునీటి సమస్యలు లేకుండా అభివృద్ధి పనులు కొనసాగుతాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు జక్కుల రాజన్నతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

## గగ్గుపల్లిలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండలం గగ్గుపల్లి గ్రామంలో ఎన్ఎస్ఎస్ శిబిరం కొనసాగుతోంది. ఈ సందర్భంగా గగ్గుపల్లి గ్రామ సర్పంచ్ కొండి నడిపి గంగాధర్ మాట్లాడుతూ విద్యార్థుల సేవాభావాన్ని అభినందించారు. గ్రామాభివృద్ధికి యువత భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. పరిశుభ్రత ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణం సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. గ్రామ ప్రజలు కూడా ఈ కార్యక్రమానికి సహకరించి విద్యార్థులను ప్రోత్సహించారు. అనంతరం విద్యార్థుల కోసం ప్రత్యేకంగా కంటి యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వాలంటీర్ రణవీర్ కంటి ఆరోగ్యానికి ఉపయోగపడే యోగాసనాలు, కంటి వ్యాయామాలపై శిక్షణ అందించారు. మొబైల్ ఫోన్లు, కంప్యూటర్ల వినియోగం వల్ల కలిగే కంటి సమస్యలను నివారించేందుకు యోగా ఉపయోగపడుతుందని వివరించారు.

## వడ్లం గ్రామాన్ని సందర్శించిన విద్యుత్‌శాఖ అధికారులు



**అక్షరటుడే, పెద్దకొడప్‌గల్:** మండలంలోని వడ్లం గ్రామంలో శుక్రవారం విద్యుత్ షాక్‌తో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో విద్యుత్ శాఖ ఏడీఏ రవీందర్ సిబ్బందితో కలిసి వడ్లం గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో లోపం కారణంగానే విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు జరిగి ఇద్దరు వ్యక్తులు మృతి చెందారని తెలిపారు. మరణించిన కుటుంబ సభ్యులకు విద్యుత్‌శాఖ తరపున ఒక్కొకరికి రూ.5లక్షల నష్టపరిహారం అందించేలా కృషి చేస్తామని ఆయన వివరించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. వడ్లం గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించేందుకు వచ్చిన విద్యుత్ శాఖ అధికారులపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్రామంలో ఎవరైనా మరణిస్తేనే వస్తారా అని అధికారులను నిలదీశారు. గ్రామంలో విద్యుత్ సమస్య రెండేళ్లుగా ఉందని.. ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా ఎవరూ పట్టించుకోలేదని వారన్నారు. విద్యుత్ సరఫరాలో నెలకొన్న సమస్యను వెంటనే మరమ్మతులు చేసి సమస్యలను రాకుండా చూసుకుంటామని గ్రామస్థులకు ఏడీఏ రవీందర్ భరోసా ఇచ్చారు.